ఎన్‌ఏడీ బస్టాప్‌లో అసౌకర్యాలు

- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- రహదారి మధ్యలో డివైడర్‌తో పొంచి ఉన్న ప్రమాదం
- ప్రయాణికులు వేచి ఉన్న చోటనే మురుగునీటి ప్రవాహం
- సౌకర్యాలు కల్పించని అధికారులు



రాజమండ్రి వైపు వెళ్లే బస్టాప్ వద్ద రహదారి మధ్యలో ఉన్న స్తంభం



నగరంలోకి వచ్చే బస్టాప్ ఎదురుగా ద్విచక్ర వాహనాల పార్కింగ్

విశాఖ విద్య : ఎన్‌ఏడీ కూడలిలో ప్రయాణికులు బస్సు ఎక్కాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. వేచి ఉండేందుకు షెల్టర్లు ఉన్నా, అవి సౌకర్యవంతంగా లేకపోవటంతో బస్సుల కోసమని రహదారిపైనే నిల్చోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు సర్వత్రా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్వారకా బస్ స్టేషన్ తర్వాత విశాఖ నగరంలో అంతటి ప్రాధాన్యత కలిగిన ఎన్‌ఏడీ బస్టాప్ వద్ద తగిన సౌకర్యాలు కల్పించడంలో ఆర్టీసీ అధికారులు శ్రద్ధ చూపకపోవటంపై పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆదాయమే తప్ప వసతుల కల్పనపై దృష్టి సారించరా..? అని ప్రశ్నిస్తున్నారు.

రహదారి మధ్యలో స్తంభం

రాజమండ్రి వైపు వెళ్లే బస్సులు ఎక్కేందుకు వేచి ఉండే బస్టాప్‌నకు సమీపంలో రహదారి మధ్యలో స్తంభం ప్రమాదకరంగా ఉంది. హైవే విస్తరణకు ముందు ఇక్కడ ఇతర ప్రాంతాలకు దూరాన్ని తెలియజేసేలా సూచిక బోర్డుల ఏర్పాటు కోసమని ఈ స్తంభాన్ని బస్టాప్ వద్ద నిర్మించారు. ఇప్పుడు ఇదే ఇక్కడ వాహనాల ప్రయాణానికి అడ్డం కలిగిస్తోంది. బస్టాప్ వద్ద ఫుట్‌పాత్‌కు 20 అడుగుల దూరంలో రహదారి మధ్యలో స్తంభం ఉంది. దీంతో ద్వారకా బస్ స్టేషన్ నుంచి వచ్చే బస్సులు ఎన్‌ఏడీ కూడలి వద్ద బస్టాప్ వైపు తిప్పే పరిస్థితి లేక డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కారణంగా బస్సులను ప్రయాణికులు వేచి ఉండే చోట నిలపకుండా, కొద్దిగా ముందుకు తీసుకెళ్లి నిలుపుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

బస్ షెల్టర్‌కు దూరంగా బస్సులు నిలుపుతుండడంతో ప్రయాణికులు షెల్టర్‌లో వేచి ఉండకుండా, బస్సుల కోసమని జాతీయ రహదారిపైనే నిల్చుంటున్నారు. బస్సులతోపాటు, హైవేపై వేగంగా వచ్చే లారీలు, ప్రైవేటు ట్రావెల్స్ వాహనాలు ప్రయాణికుల పక్క నుంచే రయ్‌మంటూ దూసుకుపోతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి మధ్యలో అడ్డంగా ఉన్న స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నా, ఆర్టీసీ, హైవే అథారిటీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్

రాజమండ్రి వైపు నుంచి నగరంలోకి వచ్చే బస్సులు ఆగే చోట (ఎన్‌సీటీఎల్ 80 ఫీట్ రోడ్ వైపు) ప్రయాణికుల కోసమని ఏర్పాటు చేసిన షెల్టర్ నిరుపయోగంగా మారుతోంది. హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి వంటి దూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సుల్లో ఎన్‌ఏడీ వద్ద ప్రయాణికులను దింపేందుకు ఇదే చోట బస్సులను నిలుపుతారు. అదేవిధంగా ఎన్‌ఏడీ సెంటర్ నుంచి నగరంలోకి వచ్చే సిటీ సర్వీసులు ఎక్కేందుకు కూడా ప్రయాణికులు ఇదే షెల్టర్ వద్ద వేచి ఉంటారు. అయితే బస్ షెల్టర్ ముందు ద్విచక్ర వాహనాలను అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. వీటిని దాటుకొని షెల్టర్‌లోకి వెళ్లడం ఇబ్బందికరంగా ఉండడంతో ప్రయాణికులు రోడ్డుపైనే బస్సుల కోసమని నిరీక్షిస్తున్నారు. రహదారి నిబంధనల పేరుతో ఎడాపెడా చలానాలు విధించే ట్రాఫిక్ పోలీసులకు ఇక్కడ అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు కనిపించడం లేదా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

మురుగునీటి ప్రవాహంతో దుర్వాసన

ఎన్‌ఎస్‌టీఎల్ వైపున ఉన్న బస్ షెల్టర్ ముందు రహదారిపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. 80 అడుగుల రోడ్ లోనుంచి వచ్చే నీరు దిగువకు పోయేందుకు డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో బస్టాప్ ముందర నుంచే వెళ్తోంది. బస్టాప్‌లోకి ప్రయాణికులు ఈ మురుగు నీరు దాటి వెళ్లాల్సి వస్తోంది. అదే సమయంలో ఆ దారిలో వచ్చే వాహనాలు తమపై మురుగునీరు కొట్టిపోతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత శాఖల అధికారులు ఇప్పటికైనా స్పందించి, ప్రాధాన్యత కలిగిన ఎన్‌ఏడీ బస్టాప్‌లో సమస్యలు పరిష్కరించి... సౌకర్యాలు మెరుగుపరచాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్ షెల్టర్‌ను వదిలేసి, పార్కులో వేచి ఉన్న ప్రయాణికులు



బస్టాప్ ముందు రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

ఏయూ విభాగాల్లో వీసీ తనిఖీలు



విభాగంలో పరిశీలిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు బుధవారం సైన్స్ కళాశాల పరిధిలో గల అడ్వాన్స్ సైన్సెస్ భవన్‌లోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బయోటిక్నాలజీ, మైక్రోబయాలజీ, ఫుడ్ న్యూట్రీషన్ విభాగాలను సందర్శించి ప్రయోగశాలలు, వసతులను పరిశీలించారు. విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మితో సమావేశమయ్యారు. విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. విభాగాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తామని వీసీ చెప్పారు.

అంతర్జాతీయ మారథాన్‌లో విశాఖవాసుల ఘనత

బీచ్‌రోడ్డు: అమెరికాలోని చికాగో నగరంలో ఇటీవల నిర్వహించిన బ్యాంక్ ఆఫ్ అమెరికా చికాగో మారథాన్‌లో వైజాగ్ రన్నర్స్ సొసైటీ సభ్యులు సత్తా చాటారు. ఈ పోటీలో ప్రపంచ దేశాల నుంచి వేలాది మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. వైజాగ్ రన్నర్స్ సొసైటీ సెక్రటరీ కె.శ్రీనివాస్, అరవింద్, ప్రియ మాథుర్, రాజేంద్ర పాల్గొని నిర్ణీత సమయం కన్నా ముందే గమ్యాన్ని చేరుకొని ఘనత సాధించారు. విశాఖ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన వీరిని సొసైటీ ప్రెసిడెంట్ బాలకృష్ణ రాయ్, ఇతర సభ్యులు అభినందించారు. సహచర సభ్యుల విజయంపై హర్షం వ్యక్తం చేశారు. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ట్రైనింగ్ సెషన్లు నిర్వహిస్తోందని, నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ సభ్యులు కోరారు.

క్లుప్తంగా

సామాజిక భవనం ప్రారంభం



భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డు ఏదురవానిపాలెం వద్ద కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ సౌజన్యంతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే పి.గణబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరమాండల్ సంస్థ గ్రామాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.25 లక్షలు వెచ్చించి ఆధునిక వసతులతో కమ్యూనిటీ హాల్ నిర్మించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఏదురవానిపాలెం గ్రామ పెద్దలతోపాటు కోరమాండల్ సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పిస్తాం



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: కొండవాలు ప్రాంతాల్లోని కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. వార్డు పరిధిలోని లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ కొండవాలు ప్రాంతంలో రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, మెట్ల మార్గం ఆధునికీకరణ పనులకు బుధవారం జీవీఎంసీ ఏఈ వెంకటలక్ష్మితో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరవ పైడిరాజు, వర్క్ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో అన్నసమారాధన

సింధియా: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురం జంక్షన్‌లో కొండదేవతమ్మ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు, స్థానిక నాయకులు నీలంరాజు, నర్సింగరావు, అప్పన్న, అప్పారావు పాల్గొన్నారు.

శిశుగృహ పరిశీలన



శిశుగృహ వద్ద వేంకటశేషమ్మ, తదితరులు

మర్రిపాలెం : డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ బుధవారం శిశుగృహను సందర్శించారు. అక్కడి పరిస్థితులను గమనించి, అందుతున్న సదుపాయాలు పరిశీలించారు. ఆమెతోపాటు ప్రాజెక్టు డైరెక్టర్ జి.జయాదేవి, మేనేజర్ ఎ.సుజాత, సోషల్ వర్కర్ ఎస్‌వీఎస్ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అద్భుతంగా స్వర సంగమం

దాబాగార్డెన్స్: నగరానికి చెందిన ముగ్గురు గాయనీమణులు నిర్వహించిన 'త్రివేణీ స్వర సంగమం'తెలుగు, హిందీ పాటలతో అలరించింది. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా బుధవారం సంస్థ వ్యవస్థాపకులు నారీ–భేరీ సమర్పణలో సీవీ రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, శైలజ మీరాజ్ ముగ్గురు గాయనీ మణులు సంయుక్తంగా ఆలపించిన తెలుగు, హిందీ గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని విశాఖ పోర్టు విశ్రాంత అధికారి హరినాథ్‌బాబు, డాక్టర్ ఉషా చీరాల, సన్‌మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ సాంస్కృతిక రంగానికి ప్రతిష్ట తెస్తున్న ముగ్గురు గాయనీమణులు అందిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఎన్‌వీఆర్ నాగేశ్వరరావు, బంగారయ్య, పుండరీకుమార్, సురేష్ కన్నా, రాజు, రామ్, భూపతిరావు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి కార్మికుల నిరసన



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న కార్మికులు

మల్కాపురం: వేతనాలు సక్రమంగా అందించకుండా.. కనీసం ఫైనల్ సెటిల్ మెంట్ కూడా పద్ధతి ప్రకారం చేయకపోవడంతో కార్మికులు ఆగ్రహించారు. తమకు న్యాయం చేయాలని బుధవారం విధులు బహిష్కరించి ఆందోళన బాట పట్టారు. హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థలో విస్తరణ పనులను ఎల్ అండ్‌టీ సంస్థ చేపడుతోంది. ఎల్ అండ్ టీ వద్ద ఎంఎంహెచ్ అనే సంస్థ సబ్ కాంట్రాక్ట్‌గా వ్యవహరిస్తూ కొన్ని పనులు రెండేళ్ల పై నుంచి చేపడుతోంది. అయితే ఆ సంస్థకు పని తగ్గడంతో చాలా మంది కార్మికులకు ఫైనల్ సెటిల్‌మెంట్ చేసేందుకు రెండు నెలల కిందట యాజమాన్యం సిద్ధపడింది.అయితే లేబర్ యాక్ట్ ప్రకారం ఒక్కో కార్మికుడు ఎన్ని సంవత్సరాల నుంచి పని చేస్తున్నాడో అన్ని సంవత్సరాల నుంచి పని చివరి రోజు వరకు లెక్కించి నెలకు ఆరు రోజుల చొప్పున ఫైనల్ సెటిల్ మెంట్ ఇవ్వాల్సి ఉంది. కానీ ఆ కాంట్రాక్టర్ మూడు రోజుల చొప్పున సెటిల్ చేస్తానని మొండికేయడంతో కార్మికులు ఆందోళన చేపట్టారు.

ఆ సంస్థ ప్రతిపాదనకు ఒప్పుకొంటే ఒక్కో కార్మికుడు సుమారు రూ రూ.60 వేల వరకు నష్టపోవాల్సి వస్తుందని వాపోయారు. లేబర్ యాక్ట్ ప్రకారం మిగిలిన కంపెనీల్లో ఎలా సెటిల్ చేశారో తమకు అదే రీతిన చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. తమ సమస్య పరిష్కరించకుంటే గురువారం కూడా నిరసన వ్యక్తం చేస్తామని కార్మికులు హెచ్చరించారు.

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకం



గొందేశివానిపాలెం వెళ్లే మార్గంలో గుంత

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో శిథిలమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు ఏర్పడ్డాయి. అడుగడుగునా గుంతలు,పిక్క తేలి ఉన్నాయి. ఆ మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు.

- పిలకవానిపాలెం ములుపు నుంచి గొందేశివానిపాలెం వెళ్లే మార్గం పిక్క తేలి, పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి.అసలే ఇరుకు రోడ్డు దీనికి తోడు రోడ్డులో గుంతలు ఉండడంతో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- ఇదే వార్డు ములగాడ విలేజ్ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఈ మార్గమంతా పెద్ద పెద్ద గుంతలతో నిండి ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు సాగించే వారు నడుము నొప్పితో వైద్యుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి కలుగుతుంది. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఆయా ప్రాంత వాసులు కూటమి నాయకుల దృష్టికి సమస్య తీసుకు వెళ్లినా స్పందన లేదు. ఇప్పటికైనా అధికారులు,పాలకులు స్పందించి శిథిలమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

బీచ్‌రోడ్డులో సినిమా షూటింగ్



లొకేషన్‌లో హీరో నాగశౌర్య

కొమ్మాది: బీచ్‌రోడ్డులో హీరో నాగశౌర్య నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ జరిగింది. ఉప్పాడ, ఎంవీపీ కాలనీల్లో బుధవారం షూటింగ్ నిర్వహించినట్లు చిత్రం యూనిట్ సభ్యులు తెలిపారు. నాగశౌర్యపై ఇప్పటికే సింహాచలం, భీమిలి, ఆర్‌కే బీచ్ ప్రాంతాల్లో పలు సన్నివేశాలు చిత్రీకరించినట్లు చెప్పారు. భీమిలి–విశాఖ పరిసర ప్రాంతాల్లో మరో నాలుగు రోజులు పాటు ఈ సినిమా చిత్రీకరణ ఉంటుందన్నారు.

ఎండా వాన..!



ఎన్‌ఏడీలో జోరుగా కురుస్తున్న వర్షం



వర్షంలోనే గొడుగు సాయంతో కాలేజీకి వెళ్తున్న విద్యార్థిని

విశాఖ విద్య: తుఫాన్ నేపథ్యంలో వాతావరణం పూర్తిగా మారిపోయింది. కొద్దిసేపు వర్షం... కొద్దిసేపు ఎండ కాసింది. బుధవారం ఎన్‌ఏడీ ఏరియాలో కురిసిన వర్షంతో రహదారులు చిత్తడిగా మారాయి. పొద్దుపొద్దునే వర్షం కురవడంతో రోజువారీ జనజీవనానికి తీవ్ర అంతరాయం కలిగింది. విధులకు వెళ్లే వారు, పాఠశాలలు, కాలేజీ చదువుల కోసమని విద్యార్థులు వర్షంలోనే గొడుగుల సాయంతో ప్రయాణం సాగించారు. అయితే మేఘాలతో కమ్మేసిన ఆకాశం ఒక్కసారిగా చల్లబడి వర్షం కురియగా, కొద్ది సేపటికే ఎండ కాయడంతో ప్రయాణికులు అవాక్కయ్యారు. ఎండ... వాన భలే ఉందని ఆహ్లాదకర వాతావరణంలో ప్రయాణాలు సాగించారు.

లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేద్దాం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హేమ

ఎంవీపీకాలనీ: స్థానిక సమత డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం లైంగిక వేధింపులు అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి ఎంటర్ ప్రీమియర్ హెచ్‌ఆర్ కన్సల్టెంట్ డాక్టర్ హేమ మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైంగిక వేధింపుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రతి కళాశాల, సంస్థల్లో ప్రత్యేక వ్యవస్థలు ఉండాలని సూచించారు. ఆయా సంస్థలు అంతర్గతంగా ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులకు రక్షణ కల్పించడంతోపాటు వివరాలను గోప్యంగా ఉంచాలన్నారు. ఫిర్యాదుదారు స్వేచ్ఛగా తన సమస్యను తెలియజేసే వాతావరణం కల్పించాలని సూచించారు. లైంగిక వేధింపుల విషయంలో విద్యార్థినులు, మహిళలు కుంగిపోకుండా ధైర్యంగా వారి సమస్యను ప్రత్యేక వ్యవస్థ ముందుంచాలన్నారు. తద్వారా లైగింక వేధింపులకు అడ్డుకట్ట వేయాలని పిలుపునిచ్చారు. లైంగిక వేధింపులకు రాజ్యాంగం అందుబాటులోకి తెచ్చిన చట్టాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



చేతుల పరిశుభ్రత అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

సీతమ్మధార : చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ఆరోగ్యం కాపాడుకోవచ్చని మేజిక్ బస్ సంస్థ ట్రైనింగ్ కమ్ మోనిటరింగ్ ఆఫీసర్ సురేంద్ర అన్నారు. గ్లోబల్ హ్యాండ్‌వాష్ డేను పురస్కరించుకుని పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ (ఎన్‌ఎంసీహెచ్)లో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం ముందు, తర్వాత... వాష్ రూమ్‌కి వెళ్లిన తర్వాత, ఆటలు ఆడిన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతులు అపరిశుభ్రంగా ఉంటే బ్యాక్టీరియా కడుపులోకి వెళ్లి పలు రోగాలకు కారణమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పైడి, పడమ్మలు, ప్రధానోపాధ్యాయుడు రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలని ధర్నా



ఆరిలోవ అంబేడ్కర్ కూడలిలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: సామాన్యులపై ఆర్థిక భారం పడుతున్న నిత్యావసర సరకుల ధరలను తగ్గించాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జోన్ ఆరిలోవ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ కూడలిలో ధర్నా చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ కూడలి నుంచి పాత ఆరిలోవ మీదుగా బాలాజీనగర్ వరకు ర్యాలీ చేశారు. పెరిగిన ధరలు అదుపు చేయాలని, పెరిగిన ధరలకు హద్దే లేదా అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కె.రెహమాన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు క్షేత్రపాలు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సామాన్య, మధ్యతరగతి ప్రజలు జీవనం సాగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నిత్యావసర సరకుల ధరలు పెంచి వారిపై మోయలేని ఆర్థిక భారం వేస్తోందని మండిపడ్డారు. ప్రజలు నిత్యావసర సరకులు కొనలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం కాలం గడుపుతోందని విమర్శించారు. ఉచిత ఇసుక ఇవ్వడం లేదు సరికదా.. ఎన్నడూలేని ధరలకు ఇసుక అమ్ముకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవుడమ్మ, లక్ష్మణరావు, కాసు బాబు, పుష్పలత, చిరంజీవి, రవి, నూకరాజు, సత్తిబాబు, వెంకటరావు పాల్గొన్నారు.

నర్సుల ఎన్నికల కోలాహలం



అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేస్తున్న ఉషారాణి

మహారాణిపేట: ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. కేజీహెచ్ క్లాక్ రూమ్‌లో నామినేషన్ల పర్వం కోలాహలంగా మారింది. అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారి బి. శ్రీనివాసరావు నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష పదవికి ఒక ప్యానల్ నుంచి ఉషారాణి నామినేషన్ దాఖలు చేశారు. ఆమెతో పాటు పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే ఇంకో ప్యానల్ నుంచి గంగా భవానీ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేశారు. మొత్తం 9 పోస్టులకు గాను 19 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఒక్క సెక్రటరీ పోస్టుకి ముగ్గురు నామినేషన్ దాఖలు చేశారు. మిగిలిన అన్ని పోస్టులకు రెండేసి నామినేషన్లు వచ్చాయని ఎన్నికల అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 555 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో రెండు ప్యానళ్లు పోటీ పడుతున్నాయి. అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, వైస్ ప్రెసిడెంట్‌తో పాటు ఐదుగురు పాలకవర్గ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. 17న నామినేషన్ల పరిశీలన, 18న ఉపసంహరణ జరుగుతుంది. అనివార్యం అయితే ఈనెల 23న ఎన్నికలు నిర్వహించవలసి ఉంది.

రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచితే సెయిల్‌లో విలీనం



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న రామస్వామి

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు యు.రామస్వామి అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో బుధవారం చేపట్టిన 1343వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో యాజమాన్యం కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని, ఉత్పత్తికి కావాల్సిన ముడిసరుకు కూడా అందుబాటులో ఉంచడం లేదని ఆరోపించారు. ఫలితంగా ఏటా నష్టాలు చవిచూడాల్సి వస్తుందని, దీనికి కార్మికులను మానసికంగా వేధించడం, ఆర్థిక ప్రయోజనాల్లో కోతపెట్టడం దారుణమైన చర్య అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్.రామారావు, శ్రీనివాస్ రెడ్డి, భానుమూర్తి, పెదిరెడ్ల నీలకంఠం, గంగాధర్, వెంకట్రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకు మాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో జి.రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ముందుగా గణపతి పూజ అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. బుధవారాన్ని పురస్కరించుకుని భక్తులు అమ్మవారికి స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు పాల్గొన్నారు.